క్లుప్తంగా

అడివెంల గ్రామ సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి వెంకట్‌రెడ్డితో అడివెంల గ్రామస్తులు

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, తిమ్మాపురం–అడివెంల లింకు రోడ్డును బీటీగా మార్చాలని, గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ, మాజీ సర్పంచ్ మద్దె పద్మల ఆధ్వర్యంలో గ్రామస్తులు హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్యలన్నింటిని త్వరలో పరిష్కరించనున్నట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదిగల ఆరాధ్య దైవం సీఎం రేవంత్‌రెడ్డి



ఆరోగ్యశాఖ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొల్లె సైదులు మాదిగ

సూర్యాపేటటౌన్ : మాదిగల ఆరాధ్య దైవం సీఎం రేవంత్ రెడ్డి అని తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లె సైదులు మాదిగ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసినా ఏ పార్టీ కూడా ముందుకు రాలేదన్నారు. మాదిగలను ఇంతకాలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారు తప్ప.. ఏ పార్టీ గానీ, ఏ ముఖ్యమంత్రి గానీ న్యాయం చేయలేదని తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేపట్టడం హర్షణీయమని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి దేవుని సతీష్ మాదిగ తదితరులు ఉన్నారు.

జాతర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : సూర్యాపేటలో ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర పోస్టర్లను బుధవారం తిరుమలగిరి ఎక్స్ రోడ్డులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్దగట్టు జాతర చైర్మన్ పోలబోయిన నర్సయ్య యాదవ్ మాట్లాడారు. జాతర వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పయ్యావుల వెంకన్న, హన్మంతు, కడెం లింగయ్య, సాంబయ్య, లింగయ్య, నగేష్, కిరణ్, నాగన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



వాగులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా గోతులు తీయిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల : అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అమీన్‌సింగ్ హెచ్చరించారు. బుధవారం తూర్పుతండా ఆవాసం పిర్యానాయక్ తండా సమీపంలోని పాలేరు వాగులో ట్రాక్టర్లు వెళ్లకుండా గోతులు తవ్వించారు. అక్రమంగా ఇసుకను తరలించినట్లు తెలిస్తే వాహనాలను సీజ్ చేసి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : బొల్లంపల్లికి చెందిన ఖమ్మంపాటి రామచంద్రు ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో మృతుడి కుమారుడు ఖమ్మంపాటి శ్రీశైలం స్నేహితులైన 1992–93 పదోతరగతి విద్యార్థులు బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రు మరో కుమారుడు ఖమ్మంపాటి రవి, కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం



కంపచెట్లు అల్లుకొని అధ్వానంగా ఉన్న కాసర్లపహాడ్–వేల్పుచర్ల లింకు రోడ్డు



బురద మడుగులా మారిన లింకు రోడ్డు..

- గుంతలు పడి బురదమయంగా మారిన కాసర్లపహాడ్–వేల్పుచర్ల లింకురోడ్డు
- బీటీ రోడ్డుగా మార్చాలని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న ప్రజలు

అర్వపల్లి : మూడు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే మండలంలోని కాసర్లపహాడ్–వేల్పుచర్ల లింకురోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఈ దారిపై రాకపోకలకు నిత్యం అవస్థలు పడుతున్నారు. వేల్పుచర్ల గ్రామ ప్రజలు ఆసరా పింఛన్లు, ఉపాధిహామీ పథకం కూలి డబ్బులను కాసర్లపహాడ్‌లో తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే సమీపంలోని తండా ప్రజలు కూడా ఇదే దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారి వెంట సుమారు 200 ఎకరాల వరకు వ్యవసాయ భూములున్నాయి. రైతులు ప్రతిరోజూ తమ పొలాల వద్దకు ఈ దారి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. వేల్పుచర్ల గ్రామ పిల్లలు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకోవడానికి కాసర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు వెళుతుంటారు. ఈ దారి సరిగా లేక వేరే గ్రామాలకు చదువుల కోసం వెళ్తున్నారు.

రెండున్నర కిలో మీటర్లు..

కాసర్లపహాడ్–వేల్పుచర్ల మధ్య రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే ఈ దారి పూర్తిగా కంపచెట్లతో నిండి బురద మడుగులా మారి గుంతలమయమైంది. ఈ దారిని బీటీగా మార్చాలని మూడు గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. అలాగే హైవే రోడ్డు నుంచి వేల్పుచర్ల గ్రామానికి కూడా బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఈ రెండు రోడ్లను బీటీగా మార్చి తమ ఇబ్బందులు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీటీరోడ్డు కోసం పోరాడుతూనే ఉన్నాం



కాసర్లపహాడ్–వేల్పుచర్ల లింకు రోడ్డును బీటీ చేయాలని కోరుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నాం. కానీ అధికారులు ఇంతవరకు స్పందించడం లేదు. ఈ రోడ్డును బీటీ చేయాలని ఎంపీలు, ఎమ్మెల్యేలకు అనేకసార్లు వినతి పత్రాలు కూడా ఇచ్చాం.

– మచ్చ నర్సయ్య, కాసర్లపహాడ్

ప్రతి పనికి కాసర్లపహాడ్ వెళ్లాల్సిందే



ప్రతినెలా ఆసరా పింఛన్లు, ఉపాధిహామీ పథకం కూలి డబ్బుల కోసం కాసర్లపహాడ్‌లోని పోస్టాఫీసుకు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే పిల్లలు కూడా చదువులకు ఈ దారిలోనే వెళ్తుంటారు. కానీ రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ దారిని బీటీగా చేసి సమస్య పరిష్కరించాలి.

– ఖమ్మంపాటి నరేష్, వేల్పుచర్ల

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఐలయ్య

నాగారం : సైబర్ నేరాల నియంత్రణ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఎం.ఐలయ్య అన్నారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు బుధవారం ఫణిగిరి మేరీమదర్ ఆఫ్ హోప్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ కళాబృందంతో అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని అన్నారు. గంజాయి, మత్తు మందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. రోడ్డుభద్రత నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు, యువతి, యువకులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ సిస్టర్ రీనా జేవియర్, హెచ్‌ఎం రోస్‌మేరీ, పోలీస్ సిబ్బంది కమలాకర్, నరేష్, రాము, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, క్రిష్ణ, చారి, గురులింగం, ఉపాధ్యాయులు నీను ఫ్రాన్సిస్, సతీష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

సూర్యాపేట : లయన్స్ కంటి ఆస్పత్రి, లయన్స్ క్లబ్ సూర్యాపేట సహకారంతో సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్ 45వ వార్డులో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ దోసపాటి గోపాల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నూకల వెంకటరెడ్డి, జోన్ చైర్మన్ దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, మీలా వంశీ, వెంపటి శభరినాథ్, బండారు రాజా, కుమ్మరికుంట్ల లింగయ్య, భావ్‌సింగ్, నూక వెంకటేశం గుప్త, మిర్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలను ధ్వంసం చేయొద్దు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నాగారం : హరితహారం కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట–జనగామ జాతీయ రహదారి వెంట నాటిన మొక్కలను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ కె.మారయ్య హెచ్చరించారు. బుధవారం ఈటూరు ఆవాసం ప్రగతినగర్ వద్ద సూర్యాపేట–జనగామ జాతీయ రహదారి పక్కన చెత్తకుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో సుమారు మూడు ఎకరాల వరకు మంటలు వ్యాపించాయి. రోడ్డు వెంట నాటిన హరితహారం మొక్కలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమీపంలో పత్తి మిల్లు ఉండటంతో మిల్లు యజమాని వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అప్పటికే ఎంపీడీఓ మారయ్య తన సిబ్బందితో వచ్చి గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్‌తో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పేశారు. ఫైర్ ఇంజన్, గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా మంటలు ఆర్పడంతో పక్కనే ఉన్న పత్తి మిల్లుకు పెనుముప్పు తప్పింది.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న దాతలు

నూతనకల్ : మండల పరిధిలోని కస్తూరిబా పాఠశాలలో అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మూడ్ మోహన్‌నాయక్, మరికంటి అశోక్, నాగు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గోశాల ప్రారంభోత్సవ పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన గోశాల ప్రారంభ పూజలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితులు గూడూరు గోపికృష్ణ నిత్యార్చన, సంపుటిత శ్రీ సూక్త సహిత లక్ష్మీ హోమం, సుదర్శన హోమం, శాంతి హోమం, ప్రాయశ్చిత హోమం, జయాది హోమం, మహా మంగళ పూర్ణాహుతితోపాటు వృషభ గోమాత కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కలశ ఉద్వాసన, అవభృద స్నానం, మహా ఆశీర్వచనం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలను తిలకించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి దంపతులు, వేద పండితులు బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి, మందిర చైర్మన్ కర్నాటి రవికుమార్, ప్రధాన కార్యదర్శి మన్నెం సదాశివరెడ్డి, కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, ఆలయ అర్చకులు వలివేటి విశ్వేశ్వర శర్మ, గంగాధర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణకు హాజరైన హిందీ ఉపాధ్యాయులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం వెలిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు మండలాల హిందీ ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి మాట్లాడారు. వృత్యంతర శిక్షణ తరగతులు ఉపాధ్యాయులకు సమకాలిన ఆధునిక జ్ఞానాన్ని అందిస్తాయని అన్నారు. ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, నిరంతర కంప్యూటర్ విద్య ఇవ్వడం వల్ల బోధనా సామర్థ్యాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు ఎండీ.హకీమ్, ఆర్‌పీలు నవీన్, ప్రభాస్, సుభాషిణి పాల్గొన్నారు.

పదిహేను శాతం నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న విద్యార్థినులు

ఆత్మకూరు (ఎస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ ఆడ పిల్లల సమానత్వ సమైక్య సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం వారు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, ఎంపీడీఓ హసింకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీఎఫ్ ఇన్‌చార్జ్ లలిత మాట్లాడారు. పక్క రాష్ట్రాలు విద్యాభివృద్ధి కోసం 14 శాతానికి పైగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7.9 శాతం నిధులను కేటాయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎఫ్ సభ్యులు సైదులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేత

మునగాల : మునగాల మండల పరిధిలోని వెంకట్రాంపురంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమై కట్టుబట్టలతో వీధిన పడ్డ నిరుపేద చింత సైదులు కుటుంబానికి గ్రామానికి చెందిన శ్రీరామ యూత్ సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత..

మునగాలకు చెందిన అమరోజు సోమయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందాడు. బుధవారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నాగరాజు బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో తాటికొండ సురేష్, తంగెళ్ల బుచ్చిబాబు, వల్లోజు జానకిరాములు, ఎస్. సతీష్ పాల్గొన్నారు.



వెంకట్రాంపురంలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న శ్రీరామ యూత్ సభ్యులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు.. ఘనంగా ధ్వజారోహణం



ధ్వజ స్తంభానికి ధ్వజపట ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



విశ్వక్సేనారాధన నిర్వహిస్తున్న అర్చకులు



తహసీల్దార్ శ్రీనివాసులుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, దేవతాహ్వానం, అఖండ దీపారాధన, దీక్షస్వీకరణ, వాస్తుపూజ, యాగశాల ప్రవేశం, అంకురార్పన, యజ్ఞం కార్యక్రమాలను జరిపారు. అనంతరం గరుడ ఆళ్వారుడిని కొత్త వస్త్రంపై చిత్రించి ఆలయ ముఖమండపం, యాగశాల నుంచి ధ్వజపటాన్ని ధ్వజస్తంభం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ గరుడ ఆళ్వారుడికి ప్రత్యేక పూజలు జరిపించి గరుడముద్దలను నైవేద్యంగా సమర్పించారు. అష్ట రాగాల ఆలాపన చేసి ధ్వజారోహణం నిర్వహించారు. వేద పారాయణికులచే వేదపారాయణం, మూలమంత్ర, అనుష్టానం గావించారు. గరుడ ముద్ద కోసం భక్తులు క్యూలైన్‌లో వచ్చి స్వీకరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి గరుడ ముద్ద కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చివరగా ఆలయంలో స్వామి పవళింపు సేవను జరిపారు. ఉత్సవాల సందర్భంగా స్థానిక ఎస్‌ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, బైరబోయిన మహరాజు, రామలింగయ్య, ధర్మకర్తలు అనిల్, కృష్ణమూర్తి, రేఖశ్రీధర్, వెంకన్న, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల అధికారులకు ఆహ్వానం

అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, మండల పంచాయతీ అధికారి గోపికి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, బైరబోయిన మహరాజు, దల్వాయి రేఖశ్రీధర్, కోమటి సోమయ్య పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి తిరుపతమ్మ జాతర ప్రారంభం



విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో బుధవారం శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా తంగెళ్లపల్లి పాండయ్యాచారి ఇంట్లో నుంచి దేవతామూర్తుల విగ్రహాలను తీసుకెళ్లి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, బాదె ధర్మయ్య, దేశగాని శ్రీనివాస్‌గౌడ్, వెంకట్రావుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పులి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల : నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గ ఎన్నికల వర్క్‌షాప్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పని విభజన ద్వారా 20 మందికి ఒక వ్యక్తిని నియమించినట్లు తెలిపారు. ప్రతి ఓటరును కనీసం మూడుసార్లు కలవాలన్నారు. బీజేపీలో పార్టీ బలపర్చిన అభ్యర్థి మాత్రమే పోటీలో ఉన్నారని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు కనీసం అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట మండలం పిన్నాయిపాలెం గ్రామం నుంచి వివిధ పార్టీలకు చెందిన 20 మంది పార్టీ మండల అధ్యక్షుడు సైదిరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సంకినేని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బందారపు లింగస్వామి, కర్నాటి కిషన్, జుట్టుకొండ సత్యనారాయణ, చల్లమల్ల నర్సింహ, సలిగంటి వీరేంద్ర, ఎండీ అబీబ్, పల్స మల్సూర్, పగిళ్ల సుసిందర్ రెడ్డి, నంద్యాల సైదులు, తాల్లపల్లి మధు, మాధవరపు అనిల్, కేసరి శోభారెడ్డి, రంగినేని లక్ష్మణ్‌రావు, గోగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జానయ్య జీవితం నేటి సమాజానికి ఆదర్శం



జానయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు, తదితరులు

పెన్‌పహాడ్ : సీపీఎం సీనియర్ నాయకుడు అంజనపల్లి జానయ్య జీవితం నేటి సమాజానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం చెట్లముకుందాపురంలో జానయ్య మృతదేహానికి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, కొక్కిరేణి పీఏసీఎస్ చైర్మన్ చందా చంద్రయ్య, వివిధ పార్టీల నాయకులు తూముల సురేష్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, రణపంగ కృష్ణ, గుర్రం గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ కోచ్ వినయ్‌కు సన్మానం



వినయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చిలుకూరు : చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు చిలక వినయ్ ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జిల్లా టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా బుధవారం నారాయణపురంలో వినయ్‌ను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణాల అబ్రహం, సీనియర్ నాయకులు కుటుంబరావు, కందుకూరి నాగేశ్వరరావు, శ్రీను, బొల్లెపంగు వెంకటి, నాగరాజు, వీరస్వామి, సైదులు, లాలు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : ముకుందాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ముకుందాపురం, జి.కొత్తపల్లి, చందుపట్ల, మామిండ్లమడవ, తూర్పుతండా, పిర్యానాయక్ తండాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆత్మకూర్ (ఎస్) : పాతర్లపహాడ్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం మండలంలోని పాతర్లపహాడ్, ముక్కుడు దేవులపల్లి, బోరింగ్ తండా, ఇస్తాలాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

మనోభావాలను దెబ్బతీయొద్దు

నాగారం : రాజకీయాల్లో ఒకరికొకరు నేరుగా విమర్శలు చేసుకోవాలి తప్ప.. అగ్రకులంటూ కులాలను లాగి వారి మనోభావాలను దెబ్బతీయొద్దని మాజీ సింగిల్ విండో చైర్మన్ గుంటకండ్ల ముకుందారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల్లో అగ్రకులాల నాయకులంటూ కులాలను లాగుతున్నారని అన్నారు. చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) సైతం అగ్రకులాలంటూ విమర్శలు చేయడం సరికాదన్నారు.

సారా తయారీదారులపై చర్యలు తప్పవు



బెల్లం పానకం పారబోస్తున్న ఎస్‌ఐ గోపికృష్ణ

పెన్‌పహాడ్ : సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గోపికృష్ణ అన్నారు. నూర్జహాన్‌పేట గుట్టల్లో సారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తెల్ల బెల్లం పానకం దొరకడంతో స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కోదాడరూరల్ : కోదాడ పట్టణం శ్రీరంగాపురంలోని అభయాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కుర్రి గోపయ్యను బుధవారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, చిత్తలూరి శివయ్య పాల్గొన్నారు.